
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 28 । జూన్ । 2024



టన్ను చీనీ రూ.27 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.27 వేలు పలికాయి. మార్కెట్‌కు 580 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



మగువలు మెచ్చిన వన్ గ్రామ్

బంగారం ధర రోజు రోజుకూ పెరుగుతోంది. దీంతో మేలిమి బంగారం కంటే మిన్నగా కనిపించే వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలపై అందరూ ఆసక్తి చూపుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
34.2°/22.6°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

- మొదటి రెండు రోజుల్లోనే పని పూర్తి చేస్తాం: కలెక్టర్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఇంటి వద్దే సామాజిక పింఛన్లు పంపిణీ చేయడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు తెలిపారు. గురువారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తదితరులు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీసీలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. జూలై 1వ తేదీన అర్హులైన వారికి పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేయడానికి శనివారమే అన్ని బ్యాంకుల నుంచి నగదు విత్ డ్రా చేస్తున్నట్లు చెప్పారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా శనివారంలోపు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీకి అవసరమైతే పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పింఛన్ల పంపిణీ తర్వాత లబ్ధిదారుల నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా 544 సచివాలయాల ద్వారా 4,852 మంది సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. రెండు రోజుల్లోనే పింఛన్ల పంపిణీ పూర్తికి చర్యలు చేపట్టామన్నారు.

కక్ష సాధింపులు మానండి



విలేకరులతో మాట్లాడుతున్న వజ్ర భాస్కర్‌రెడ్డి

కదిరి టౌన్: సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన పరిణామాలన్నింటినీ మరిచి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి కూటమి నేతలకు సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. కదిరి నియోజకవర్గ ప్రజలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందించేందుకు మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించి చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడానికి కృషి చేయాలన్నారు. పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థలు అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని కోరారు. హంద్రీ–నీవా కాలువ పనులు పూర్తి చేసి నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ సాగు, తాగు నీరు అందించి ఈ ప్రాంత రైతుల అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. నియోజకవర్గంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలన్నారు. నియోజకవర్గంలోని బీడీ కార్మికులకు వసతులు మెరుగుపరచడంతో పాటు వలసలు నివారించి గార్మెంట్స్ ఫ్యాక్టరీలు నిర్మించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

ప్రతి రైతు ఖాతాలో రూ.20 వేలు జమచేయాలి



ఆర్డీఓ భాగ్యరేఖకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే రూ.20 వేలను ప్రతి రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య డిమాండ్ చేశారు. గురువారం రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, సహాయ కార్యదర్శి చంద్ర, జిల్లా నాయకులు అడపాల వేమనరాయణ తదితరులు పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ప్రతి రైతుకూ రూ.20 వేలు ఇవ్వాలన్నారు. అలాగే రూ.2 లక్షల రుణమాఫీ, బంగారు నగలు బ్యాంకుల నుంచి విడిపించాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకూ రూ. 10 వేలు పింఛన్, రూ.3 లక్షల వరకూ వడ్డీ లేని రుణాలు, రూ.5 లక్షల వరకూ పావలా వడ్డీ ఇచ్చి ఆదుకోవాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రకటించి ఎగ్గొట్టిన రుణమాఫీ డబ్బును తిరిగి చెల్లించాలని విన్నవించారు.

బ్యాడిగి.. సాగు పెరిగి

- బ్యాడిగి మిర్చి సాగుపై అన్నదాతల ఆసక్తి
- విత్తన ధరలు ఆకాశాన్నంటినా సాగుకు సై అంటున్న వైనం
- ప్రస్తుతం 'సింజెంటా' కిలో రూ.1.35 లక్షల నుంచి రూ.1.50 లక్షలు
- 'డబ్బి' కిలో రూ.6 వేల నుంచి రూ.8 వేలు

మార్కెట్‌లో ధరలు బాగుండడం, కొంచెం కష్టపడితే మేలైన దిగుబడులు వస్తుండడం వెరసి.. జిల్లాలో బ్యాడిగి మిరప సాగు పెరుగుతోంది. విత్తన ధరలు పెరిగినా రైతులు ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. సుదూర ప్రాంతాలకు వెళ్లి మరీ విత్తనాలు కొనుగోలు చేసి తీసుకువచ్చి సాగు చేస్తున్నారు.





నర్సరీలో పెరుగుతున్న మిరపనారు

రాయదుర్గం: ఎర్ర బంగారంగా పిలిచే (బ్యాడిగి) మిర్చి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో ఏటేటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పంట ఉత్పత్తుల్లో తెగుళ్లు కట్టడిచేస్తే ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధ్యమవుతాయి. మార్కెట్లో గిట్టుబాటు ధరలు వస్తుండడంతో సాగుపై అన్నదాతలు మక్కువ పెంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన విత్తనాలను సమకూర్చుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పంట సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా మిరప సాగుచేసే నియోజకవర్గాల్లో ఉరవకొండ మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత రాయదుర్గం, కళ్యాణదుర్గం ఉన్నాయి.

చుక్కలు చూపుతున్న విత్తన ధరలు

మిరపలో మొదటి రకం విత్తనాల ధరలు ఆకాశాన్నంటాయి. ఏమాత్రం దిగిరానంటున్నాయి. అయినా రైతు తగ్గేదే లే అంటున్నాడు. నచ్చిన విత్తనం కొనుగోలుకు ఎంత దూరమైనా సరే పయనమవుతున్నారు. ఎక్కువ మంది కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, కర్నూలు జిల్లా ఆదోని ప్రాంతాల్లో సింజెంట రకం విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. డబ్బి రకం అయితే హుబ్లీ, ధార్వాడ, బళ్లారి ప్రాంతాల్లో కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం సింజెంటలో మొదటి రకం కిలో రూ.1.35 లక్షల నుంచి రూ.1.50 లక్షలు పలుకుతోంది. డబ్బి అయితే రూ.6 వేల నుంచి రూ.8 వేలకు పైగా ధర ఉంది. ఎకరా విస్తీర్ణంలో సింజెంట విత్తనం అయితే 100 నుంచి 120 గ్రాములు, డబ్బి అయితే కిలోకు పైగా నాటుకోవాల్సి వస్తోంది.

గత నష్టాలు పూడ్చుకునేలా..

ఎండు మిర్చి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గతేడాది మూడు నియోజకవర్గాల్లో సుమారు 40 వేల ఎకరాలకు పైగా మిర్చి పంట సాగులోకి వచ్చింది. ఈ ఏడాది మరో 10 వేల ఎకరాలకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనాకు వచ్చారు. మార్కెట్లో నాణ్యమైన మిర్చి క్వింటా రూ.55 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతోంది. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా మిర్చి పంట తెగుళ్ల బారిన పడింది. దీంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. కొందరికైతే పెట్టుబడులు కూడా దక్కలేదు. ఆ లోటును ఈ సారి భర్తీ చేసుకునేలా రైతులు ముందస్తు ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఎకరం సాగు చేసే రైతు రెండు ఎకరాలకు చేరడమే ఇందుకు నిదర్శనం.

ఆర్‌బీకేల్లో విత్తనాలందిస్తే మేలు

గతేడాది రైతుకు అవసరమయ్యే విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లోనే రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసింది. విత్తన కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని నాణ్యమైన విత్తనాలు అందించింది. కొత్త ప్రభుత్వం ఈ విషయంపై ఇప్పటివరకూ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా ఆర్‌బీకేల్లోనే విత్తనాలు రాయితీతో అందించాలని రైతులు కోరుతున్నారు.

పది ఎకరాలకు తగ్గేది లేదు



ఏటా మిర్చి పంట సాగు చేస్తా. గతేడాది కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెంచుతున్నా. ప్రస్తుతం పది ఎకరాలకు తక్కువ కాకుండా మిరప నాటేలా పొలం సిద్ధం చేశా. కొంత నారు, కొన్ని విత్తనాలు సమకూర్చుకున్నా. తెగుళ్లే కాస్త కలవరపాటుకు గురిచేస్తాయి. ఈ సారి ముందస్తుగా మేల్కొని పంటను కాపాడుకుంటా. మిర్చికి మార్కెట్లో ఆశించిన ధరలు లభిస్తాయి.

– సుధాకర్‌రెడ్డి, రైతు, పూలకుంట

బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో మే, 2024లో నిర్వహించిన బీటెక్ రెండో సంవత్సరం, రెండో సెమిస్టర్ (ఆర్–20) , బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు గురువారం విడుదల చేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ చేతుల మీదుగా ఫలితాలు ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణ కాంతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి. విష్ణువర్ధన్, డాక్టర్ డి. లలితకుమారి, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం . రామశేఖర్ రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి. మమత, సివిల్ విభాగాధిపతి అజిత తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ కోర్సులో శిక్షణ

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో జూలై 6వ తేదీ నుంచి డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన యువతీ యువకులు శిక్షణకు అర్హులని వెల్లడించారు. ఆసక్తి గల యువతీ యువకులు కళాశాలలోని స్కిల్ హబ్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9676706976 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, చిత్రంలో ఐదో ఆర్థిక కమిషన్ సభ్యులు

- జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి

అనంతపురం సిటీ: ఆదాయ వనరులపై దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి అన్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో గల డీపీఆర్‌సీ భవన్‌లో గురువారం ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, మేజర్ పంచాయతీ కార్యదర్శులు, ఎంపిక చేసిన సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను సమీక్షించారు. ఆదాయ వనరులు ఎలా సమకూర్చుకుంటున్నారు, వాటిని ఎలా ఖర్చు పెడుతున్నారనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ వ్యవస్థలోనైనా ఆర్థిక వనరులే కీలకమన్నారు. ఆదాయ వనరులను పెంపొందించుకున్నప్పుడే ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడి ఆర్థికంగా బలోపేతం కాగలమన్నారు. రాష్ట్ర ఐదో ఆర్థిక కమిషన్ సెక్రటరీ కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులు సమీక్షించి, జవాబుదారీతనం పెంపొందించడమే ధ్యేయంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూలధన వ్యయం, స్థానిక సంస్థల అవసరాలు అంచనా వేయడానికి శిక్షణ తరగతులు దోహదపడతాయని పేర్కొన్నారు. మండల, జిల్లా పరిషత్ పరిధిలో పన్నుల వర్తింపు, ఖర్చులు, ఇతర ప్రాథమిక అవసరాల తీర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్థిక కమిషన్ సభ్యులు ప్రసాదరావు, పద్మారావు, కృపారావు, డీపీఓ ప్రభాకర్‌రావు, డిప్యూటీ సీఈఓ లలితబాయి పాల్గొన్నారు.

పరిశ్రమలతోనే ప్రగతి

అనంతపురం టౌన్: పరిశ్రమల స్థాపనతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు అన్నారు. గురువారం స్థానిక పరిశ్రమల శాఖ కార్యాలయంలో పరిశ్రమల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన అనంతపురం జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్కులను ఏర్పాటు చేసి స్థలాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సైతం విద్యుత్ రాయితీతోపాటు పెట్టుబడి రాయితీలను అందిస్తుందన్నారు. ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ నాగార్జున మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీలో దరఖాస్తు చేసుకున్న వెంటనే స్థల మార్కెట్ విలువపై రాయితీలు అందించడంతో పాటు మౌలిక వసతులను కల్పించి కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని పరిశ్రమల స్థాపన కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ మేనేజర్ ప్రకాష్, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు శేషాంజనేయులు, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• వినూత్నంగా కలుపుతీత



సైకిల్ రిమ్ అమర్చిన గుంటకతో పంటలో కలుపు తీస్తున్న రైతు నాగరాజు

మడకశిర రూరల్: పంటలో కలుపు మొక్కలు తీసేందుకు ఓ రైతు వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టారు. వివరాల్లోకెళితే... మండల పరిధిలోని కదిరేపల్లికి చెందిన నాగరాజు రెండు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాడు. అయితే పంటలో గుంటకలు వేయడానికి ఆయన వద్ద ఎద్దులు లేవు. బాడుగ చెల్లించి పనిచేయించే ఆర్థిక స్తోమత కూడా లేదు. దీంతో వినూత్న పద్ధతిలో గుంటకలు వేయడానికి శ్రీకారం చుట్టారు. సైకిల్ రిమ్‌కు రూ.వేయి ఖర్చు పెట్టి తయారు చేసుకున్న గుంటకతో పంటలో కలుపు తీస్తున్నాడు. ఈ విధంగానే గుంటకలను తయారు చేసి కాడ్డెదులు లేని రైతులకు ప్రభుత్వం అందిస్తే బాగుంటుందని నాగరాజు చెబుతున్నారు.

టీడీపీ దాడులు హేయం

- మంత్రి సవిత ఇలాకాలోనే మహిళపై దాడి చేస్తారా?
- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్



వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుశీలమ్మను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: 'పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుశీలమ్మపై టీడీపీ కార్యకర్తలు దాడి చేయడం హేయం. మహిళలపై టీడీపీకి ఎంత గౌరవం ఉందో ఈ ఘటన రుజువు చేస్తోంది' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ తెలిపారు. ఇటీవల సుశీలమ్మపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే గురువారం మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ సుశీలమ్మను పరామర్శించారు. అలాగే టీడీపీ కార్యకర్తలు నష్టపరచిన సమీపంలోని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షహనాబీ, యాసిన్‌లకు చెందిన కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె బాధితులకు ధైర్యం చెప్పారు. ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ మంత్రి సవిత నియోజకవర్గంలోనే మహిళలకు రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పసుపు బిళ్ల తీసుకుని ఆఫీసులకు వెళ్తే చాలు ఆయా కార్యాలయాల్లో టీ, కాఫీ ఇచ్చి పని చేస్తారని మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడటం సమంజసం కాదన్నారు. ప్రజలు మంచి జరుగుతుందని ఓటేసి గెలిపిస్తే ఇలా దాడులకు దిగడం ఎంత మాత్రం సరికాదన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారని, అయితే ఇప్పుడు మహిళలను కించపరుస్తూ నేడు టీడీపీ కార్యకర్తలు దాడికి దిగడాన్ని ఖండిస్తున్నామన్నారు. అలాగే ఇటీవల అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వకూడదని ముందే నిర్ణయించుకుని మంత్రుల ప్రమాణ స్వీకారం అనంతరం జగనన్నతో ప్రమాణ స్వీకారం చేయించడం సరికాదన్నారు. దీనికి తోడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు జగన్ ఇంకా చావలేదంటూ మాట్లాడిన మాటలు చాలా బాధాకరమన్నారు. ఆయన మాటలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వలంటరీ వ్యవస్థను కొనసాగిస్తామని, రూ. 5 వేలకు బదులు రూ.10 వేలు ఇస్తామన్న సీఎం చంద్రబాబు నేడు దాని ఊసెత్తడం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, కౌన్సిలర్లు సుధాకరరెడ్డి, శేషాద్రి, నాయకులు జయశంకరెడ్డి, నారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, యాసిన్, బోయబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పరిగి: పార్టీ ఓడిపోయిందని ఎవరూ అధైర్య పడాల్సిన పని లేదని... ఇంతవరకూ జరిగిన పరిణామాలతో మొక్కవోని ధైర్యంతో నిలబడిన ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకూ తాను అండగా ఉంటానని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ భరోసా ఇచ్చారు. పరిగి మండల పర్యటనకు గురువారం ఆమె వచ్చారు. తొలుత మండలంలోని శ్రీరంగరాజుపల్లి పంచాయతీ పరిధిలోని ముల్లమోతుకపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డిని కలిశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకుల ఒత్తిడితో పరిగి పోలీస్‌స్టేషన్‌లో సోషల్ మీడియా కార్యకర్త మనోహర్‌పై ఇటీవల బైండోవర్ కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగానే మనోహర్‌ను మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పరామర్శించారు. అనంతరం నాయకుడు జయచంద్రారెడ్డి ఇంటికెళ్లి పలు విషయాలపై చర్చించారు. అనంతరం హొన్నంపల్లి పంచాయతీ జంగాలపల్లికి వెళ్లి టీడీపీ శ్రేణుల దాడుల్లో గాయపడిన రమేష్, ఎల్లప్పను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, సర్పంచ్‌లు లక్ష్మీదేవి, బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు లింగమ్మ, మారుతీరెడ్డి, చిక్కన్న, అమరావతి, మాజీ కన్వీనర్ జయరాం, కోఆప్షన్ మెంబర్ సలీం, రఫీక్, ఎస్సీ సెల్ నాయకులు శివ, శంకర తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ అధికారంలో లేకపోయినా కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. మండలంలోని తుంగోడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అభి, సూర్య ప్రతాప్‌రెడ్డిపై టీడీపీ నాయకులు అక్రమ కేసులు బనాయించడంతో గురువారం ఆమె వారిని పరామర్శించారు.

కొనసాగుతున్న టీడీపీ దాడులు

- వైఎస్సార్‌సీపీ నాయకుడికి చెందిన బోరుబావి పూడ్చివేత



ధ్వంసమైన బోరు బావి, పైపులు

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు పెరిగాయి. ఇందులో భాగంగానే పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకుల ఆస్తులను ధ్వంసం చేయటంతో పాటు భౌతిక దాడులకు తెగబడుతున్నారు. తాజాగా బుధవారం రాత్రి బుక్కపట్నం మండలం కొత్తకోటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, రైతు బోయ ఆంజనేయులుకు చెందిన 700 అడుగుల బోరు బావిలోకి రాళ్లు, మట్టి వేసి పూడ్చి వేశారు. ఇదే విషయాన్ని ఆంజనేయులు గురువారం బుక్కపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకున్న నాలుగు ఎకరాల భూమిలో 700 అడుగులు బోరు వేశానని, నీళ్లు కూడా పుష్కలంగా ఉండటంతో మామిడి సాగు చేశానని తెలిపారు. అయితే టీడీపీ నాయకులు బోరు బావికి పైకి నీళ్లు వచ్చే పైపులను ధ్వంసం చేసి మోటారు, పంపును బావిలోకి వదిలి రాళ్లు, మట్టితో పూర్తిగా పూడ్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రూ.3 లక్షల వరకూ నష్టం వచ్చిందన్నారు. తిరిగి బోరు, మోటారు ఏర్పాటు చేసుకోవాలంటే మరో రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని వాపోయారు.

దాడులు అమానుషం : మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

టీడీపీ అధికారంలోకి వచ్చిన 20 రోజులలోనే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై భౌతికంగా దాడులకు దిగటంతో పాటు ఆస్తులను నష్టపరుస్తుండటం అమానుషమని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపిన బడుగులపై ఈ విధంగా దాడులకు దిగటం ఎంత వరకూ న్యాయమని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. దాడులు ఇలాగే కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



పూడిపోయిన బోరు బావిని పరిశీలిస్తున్న బాధిత రైతు ఆంజనేయులు

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన నరసింహమూర్తి (34) బుధవారం రాత్రి తన ఇంటి ఎదుటే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఘటనపై గోరంట్ల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థిని ఆత్మహత్య

మడకశిర రూరల్: మండలంలోని గౌడనహళ్లికి చెందిన ఇంటర్ విద్యార్థిని తేజశ్రీ (16) ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు తెలిపారు. ఏడాదిగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెను తల్లిదండ్రులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె బుధవారం రాత్రి కడుపు నొప్పి తాళలేక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇరిగేపల్లిలో చోరీ

అగళి: తాళం వేసిన ఇంట్లోకి దుండగులు చొరబడి విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... అగళి మండలం ఇరిగేపల్లికి చెందిన బి.డి.లక్ష్మన్న, వరలక్ష్మి దంపతులు బుధవారం ఇంటికి తాళం వేసి కర్ణాటకలోని హిరియూరులో బంధువుల ఇంట జరిగే శుభ కార్యంలో పాల్గొనేందుకు వెళ్లారు. విషయాన్ని గుర్తించిన దుండగులు అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లోకి చొరబడి బీరువాను ధ్వంసం చేసి, అందులోని 10 గ్రాముల బంగారు గొలుసు, ఓ ఉంగరం, 8 గ్రాముల బరువున్న జత కమ్మలు, రూ.2.50 లక్షల నగదు అపహరించుకెళ్లారు. గురువారం ఇంటికి చేరుకున్న లక్ష్మన్న దంపతులు చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మగువలు మెచ్చిన వన్ గ్రామ్

- సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో లేని బంగారం ధర
- బంగారు తాపడం నగలపై నానాటికీ పెరుగుతున్న ఆసక్తి
- రోల్డ్‌గోల్డ్ స్థానంలో వన్‌గ్రామ్ గోల్డ్



ధర్మవరం అర్బన్: కొన్నేళ్లుగా బంగారం ధర రోజు రోజుకూ పెరుగుతోంది. దీంతో ఆభరణాల కొనుగోలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తలకు మించిన భారంగా మారింది. ఈ నేపథ్యంలోనే చూసేందుకు మేలిమి బంగారం కంటే మిన్నగా కనిపించే వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలపై అందరూ ఆసక్తి చూపుతున్నారు. పండుగలు, శుభకార్యాలకు వీటిని ధరిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లోనూ వన్‌గ్రామ్ గోల్డ్ దుకాణాలు ఇబ్బడి ముబ్బడిగా వెలిసి వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి.

తేడా గుర్తించడం కష్టమే..

మార్కెట్లోకి వన్‌గ్రామ్ గోల్డ్ నగలు రాకముందు గిల్టు నగలకి, బంగారు నగలకీ చూసేందుకు చాలా తేడా ఉండేది. ఫ్యాషన్‌గా పెట్టుకోవడానికే తప్ప గిల్టు నగలు పెళ్లిళ్ల లాంటి పెద్ద వేడుకలప్పుడు ధరించడానికి అంతగా ఇష్టపడేవారు కాదు. కానీ, ఇప్పుడు ఇత్తడేదో పుత్తడేదో తెలియనంతగా అందమైన రాళ్ల నగిషీలతో మెరిసిపోతూ వన్‌గ్రామ్ గోల్డ్ నగలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో వయసు భేదం లేకుండా చిన్నాపెద్దా అందరూ వీటిని ఇష్టంగా ధరిస్తున్నారు. చెవిపోగుల నుంచి కాలిపట్టీల వరకూ... హారాల నుంచీ వడ్డాణాల దాకా అచ్చం బంగారమేమో అనిపించేలా ఆకట్టుకుంటున్నాయి.

రోల్డ్‌గోల్డ్‌కు, వన్‌గ్రామ్‌కు తేడా ఇదే..

రోల్డ్‌గోల్డ్‌కు, వన్‌గ్రామ్ బంగారు ఆభరణాలకు పెద్దగా తేడా ఉండదు. రోల్డ్‌గోల్డ్ నగలను రాగి, ఇనుము, అల్యూమినియం తదితర వాటితో తయారు చేస్తారు. వీటికి 8 లేక 10 క్యారెట్ల బంగారం పూత వేస్తారు. 10 క్యారెట్ల బంగారంలో 41.7 శాతం మాత్రమే బంగారం ఉంటుంది. నీళ్లలో వాడితే ఇవి త్వరగా నల్లబడిపోతాయి. ఇక వన్‌గ్రామ్ గోల్డ్ నగలను కేవలం రాగి లేదా వెండితో మాత్రమే తయారు చేస్తారు. వీటిని 22 లేదా 24 క్యారెట్ల బంగారంతో తాపడం చేయడం ద్వారా బంగారు ఆభరణాలకంటే ఎక్కువ ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఎక్కువ కాలం రంగు పోకుండా ఉంటాయి.

తయారీ ఎక్కడ..

వన్‌గ్రామ్ గోల్డ్ ఎక్కువగా ముంబయి, బెంగళూరు, మహారాష్ట్ర, గుజరాత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా చేస్తున్నారు. గాజులు, నెక్లెస్‌లు, వడ్డాణాలు, గొలుసులు, ఉంగరాలు, లాకెట్లు, వంకీలు, కాళ్ల పట్టీలు, చెవి రింగులు వంటి పలు రకాల నగలతో పాటు ఆర్డర్లపై ప్రత్యేకంగా కోరిన మోడల్‌నూ తయారు చేసి ఇస్తున్నారు.

ఉపాధి కల్పిస్తోన్న వ్యాపారం..


బంగారం తర్వాత బంగారం అంతటి పేరున్న వన్‌గ్రామ్ గోల్డ్ వ్యాపారులకు ఉపాధి మార్గాలను చూపుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రతి పట్టణం, మండల కేంద్రాల్లో ప్రత్యేక షాపులు ఏర్పాటు చేసి వీటి అమ్మకాలు సాగిస్తున్నారు. ఒక్క అనంతపురం నగరంలోనే వందకుపైగా వన్‌గ్రామ్ గోల్డ్ అమ్మకాలు జరిపే దుకాణాలున్నాయంటే వీటిపై ఉన్న క్రేజ్ ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ ఆభరణాలు వివిధ ఆకారాల్లో రూ.100 నుంచి రూ.6వేల వరకు అందుబాటులో ఉంటున్నాయి.

చోరీ జరిగినా.. నష్టం లేదు

ఇటీవల చైన్ స్నాచింగ్‌లు, ఇంటికి తాళం వేస్తే దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలు జరిగినా ఆర్థికంగా నష్టం ఉండదనే ఉద్దేశంతో చాలా మంది ధనిక వర్గాల మహిళలు సైతం మేలిమి బంగారు నగలను బ్యాంక్ లాకర్లలో భద్రపరిచి, వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలను ఇంట్లో తెచ్చి పెట్టుకుంటున్నారు. ప్రత్యేకమైన సందర్భాల్లో తప్ప మరెన్నడూ బంగారు ఆభరణాల జోలికి వెళ్లడం లేదు. మిగిలిన సమయాల్లో వన్‌గ్రామ్ గోల్డ్‌తోనే కాలం నెట్టుకొస్తున్నారు. వీటికి గ్యారంటీ కూడా లభిస్తుండడంతో వినియోగదారుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది.



ప్రత్యేక డిజైన్లలో తయారు చేసిన వన్ గ్రామ్ గోల్డ్ గాజులు



వన్ గ్రామ్ గోల్డ్ నల్లపూసల గొలుసులు



కొనుగోలుదారులతో నిండిన ధర్మవరంలోని వన్‌గ్రామ్‌గోల్డ్ షాపు

ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్ధారణ తప్పనిసరి



ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అపూర్వభరత్

పరిగి: రెవెన్యూ శాఖ పరిధిలో ప్రజలకు జారీ చేసే ప్రతి సర్టిఫికేట్‌కూ సరైన ఆధారాలను పరిశీలించి నిర్ధారణ చేసుకున్న అనంతరమే జారీ చేయాలని సంబంధిత అధికారులను పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. గురువారం ఆయన పరిగి మండలం శాసనకోటలో పర్యటించారు. ప్రధానంగా కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు అంశానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఇటీవల మంజూరు చేసిన కుల ధ్రువీకరణ పత్రాలలో ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సరి చేసుకోవాలని తహసీల్దారు రాజేశ్వరికి సూచించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రం జారీ అయితే దానికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రం జారీ చేయడం ఉత్తమమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించాలి

- ప్రారంభమైన 14వ అంతరజిల్లా బాలుర హాకీ టోర్నీ



హాకీలో తలపడుతున్న క్రీడాకారులు

ధర్మవరం అర్బన్: అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించాలని హాకీ క్రీడాకారులకు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం 14వ అంతర జిల్లా బాలుర హాకీ టోర్నీని వారు ప్రారంభించి, మాట్లాడారు. మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడి వచ్చే ఏడాది నిర్వహించే టోర్నీకి టర్ఫ్‌కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. జిల్లా హాకీ జనరల్ సెక్రటరీ బంధనాథం సూర్యప్రకాష్ మాట్లాడుతూ... టోర్నీలో 17 జిల్లాల జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. కాగా, గురువారం ఉదయం ఎన్టీఆర్, ఏలూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 18–0 గోల్స్ తేడాతో ఎన్టీఆర్ జిల్లా జట్టు విజయం సాధించింది. అలాగే శ్రీకాకుళం, తిరుపతి జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 1–4 గోల్స్ తేడాతో తిరుపతి జట్టు గెలుపొందింది. ప్రకాశం, వైఎస్సార్ జట్ల మధ్య మ్యాచ్‌లో 8–0 గోల్స్ తేడాతో ప్రకాశం జట్టు విజయం సాధించింది. కృష్ణ జట్టుపై 12–0 గోల్స్ తేడాతో కాకినాడ జట్టు విజయం సాధించింది. 1–2 గోల్స్ తేడాతో అన్నమయ్య జట్టుపై విశాఖపట్నం జట్టు గెలుపొందింది. అనకాపల్లి, అనంతపురం జట్ల మధ్య మ్యాచ్, నెల్లూరు, గుంటూరు జట్ల మధ్య మ్యాచ్ 3–3 పాయింట్లతో డ్రా గా ముగిశాయి. కార్యక్రమంలో ఏపీ హాకీ సీఈఓ నిరంజన్‌రెడ్డి, హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్, కోశాధికారి థామస్ పీటర్, జిల్లా హాకీ అసోసియేషన్ ప్రతినిధులు రామచంద్ర, అంజన్న, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతుడు రమణ

తనకల్లు: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం వడ్డిపల్లికి చెందిన గుర్రంకొండ రమణ (50) తనకల్లు మండలం పూలకుంటపల్లిలో నివాసముంటూ వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ముగ్గురు పిల్లలున్నారు. ఈ క్రమంలో గురువారం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన సమయంలో స్టార్టర్ బాక్స్‌లో వైర్లు పక్కకు వైదొలిగి ఉన్నాయి. గమనించిన ఆయన మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైతుల సమస్యలపై కేంద్రాన్ని నిలదీద్దాం

- జాతీయ రైతు సంఘాల పిలుపు



సంఘీభావం తెలుపుతున్న జాతీయ రైతు సంఘ నాయకులు

హిందూపురం టౌన్: దేశ వ్యాప్తంగా రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీద్దామంటూ కిసాన్ మోర్చా రైతు హక్కుల పోరాట నాయకుడు జగ్జీత్‌సింగ్ దలయ్‌వాల్, కర్ణాటక రైతు ఐక్యవేదిక రైతు అసోయేషన్ అధ్యక్షుడు శాంతకుమార్ పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యలపై హిందూపురం సమీపంలోని వన్నంపల్లి కాలాఫామ్‌లో మొహిందర్ జిత్‌సింగ్ ఆధ్వర్యంలో మొహమ్మద్ ఉమర్ ఫారూఖ్ ఖాన్ అధ్యక్షతన గురువారం చర్చా వేదిక నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా రైతులు పండించిన అన్ని పంటల కొనుగోలుకు ఎమ్మెస్పీకి హామీ ఇచ్చేలా చట్టం చేయడంతో పాటు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం పంటలకు గిట్టుబాటు ధరలూ నిర్ణయించాలన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు పూర్తి రుణమాఫీ అందించాలన్నారు. భూసేకరణ చట్టం 2013ని దేశవ్యాప్తంగా మళ్లీ అమలు చేసి భూసేకరణ రైతులకు లిఖితపూర్వక సమ్మతిని, ప్రస్తుత ధరకు 4 రెట్ల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి వైదొలిగి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను నిలిపివేయాలన్నారు. రైతులు, రైతు కూలీలకు పింఛన్లు ఇవ్వాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను మెరుగు పరచి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల కంపెనీల యాజమాన్యాలకు కఠిన శిక్షలతో పాటు భారీగా జరిమానాలు విధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనాల నాణ్యతను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో సమావేశాల్లో స్వామినాథన్ సిఫార్సులను చట్టంగా చేసి రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల జాతీయ నాయకులు అభిమన్యు కిహాడ్ హరియాణా, జగ్జిత్‌సింగ్ దలివాలా, కర్ణాటక సంయుక్త కిసాన్ మోర్చా శాంతకుమార్, నారాయణరెడ్డి, దక్షిణ భారత రాష్ట్రాల సమన్వయకర్త తమిళనాడు పీఆర్ పాండ్యన్, హరియాణా లక్వీందర్ సింగ్, న్యూఢిల్లీ జాఫర్ ఖాన్, సుఖ్‌జిత్ సింగ్, స్థానిక రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు వెంకట రామిరెడ్డి, చైతన్య గంగిరెడ్డి, సిద్ధారెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, సీపీఐ వినోద్‌కుమార్, దండోరా సతీష్, ఆంజనేయులు, కార్మిక సంఘం నాయకుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీదరి... నాట్య మంజరి



వరల్డ్ రికార్డులతో...



సాధించిన అవార్డులు చూపుతున్న శ్రీదరి

- కూచిపూడిలో రాణిస్తున్న విద్యార్థి
- గిన్నీసును తాకిన 'అనంత' కళాకెరటం

అనంతపురం కల్చరల్ : అనంత కళావేదికపై ఓ సారి నృత్యపోటీలు జరుగుతున్నాయి. శాస్త్రీయ నృత్యం కావడంతో పెద్ద సంఖ్యలో కళాభిమానులు హాజరయ్యారు. ఒకరిని మించి మరొకరు పోటీ పడుతూ అభినయిస్తున్నారు. అయితే అందరిలోనూ చిన్నారి శ్రీదరి నాట్యం అందరినీ మంత్ర ముగ్ధులను చేసింది. అప్పటికి ఆ చిన్నారికి పదేళ్లయినా లేవు. గిర్రున తిరుగుతున్న కాలచక్రంతో పోటీపడుతున్నట్లు మరో ఎనిమిదేళ్లలో దాదాపు వందకు పైగా ప్రదర్శనలు, దేశవిదేశాలలో లెక్కలేనన్ని అభినందనలు, సన్మానాలు అందుకుంది. కూచిపూడిలోని ప్రతి అంశాన్ని ఆకళింపు చేసుకున్న శ్రీదరి.... అనంత నృత్య కళానిలయం తీర్చిదిద్దిన అపురూప రత్నంగా అనతికాలంలోనే ఖ్యాతిగాంచింది.

బాల్యంలోనే మువ్వల సవ్వడి..

అనంతపురం నగరానికి చెందిన టీకే ఆనంద్, గాయత్రి దంపతుల కుమార్తె శ్రీధరి తన ఐదేళ్ల వయసులోనే మువ్వల సవ్వడికి ఆకర్షితురాలైంది. ఆ చిన్నారి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు సైతం ఆమెను శాస్త్రీయ నృత్యం వైపు ప్రోత్సహించారు. ప్రముఖ నృత్య దర్శకులు సంధ్యామూర్తి వద్ద శిక్షణ మొదలు పెట్టిన అనతికాలంలోనే వందలాది ప్రదర్శనలతో మైమరిపించింది. ప్రధాన పాత్రలలో అద్భుత అభినయాన్ని ప్రదర్శించి అందరి మన్ననలను పొందింది. భరతనాట్యం, కూచిపూడి, జానపదం... నృత్యరీతి ఏదైనా శ్రీదరిది అగ్రతాంబూలమే. ఇప్పటికే జాతీయస్థాయిలో వివిధ ప్రాంతాల్లోనే కాకుండా జర్మనీలో సైతం అనంత తరపున కళా ప్రదర్శనలిచ్చి మెప్పించింది.

అందుకున్న అవార్డులు ఇవే..

- 2014లో నాట్య ప్రస్థానం ప్రారంభించిన మూడేళ్లకే 2017లో చెన్నైలో జరిగిన గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసుకుంది.
- 2018లో నాట్యకళా నీరాజనం పేరు సాగిన భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో పాల్గొని ఉత్తమ ప్రదర్శనకు గాను ప్రశంసా పత్రాన్ని అందుకుంది.
- 2019లో ప్రదర్శించిన సారంగలాసిత లోనూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది.
- 2019లో డెహరాడూన్‌లో జరిగిన రంగ్ మహోత్సవ్‌లో పాల్గొని జానపద నృత్య విభాగం, కూచిపూడి రెండింటిలోనూ ప్రథమ స్థానంలో నిలిచింది.
- 2019లో తమిళనాడులోని తిరువరూరులో జరిగిన నృత్య ప్రదర్శనల్లో రాణించి ట్రెడిషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుంది.
- 2023లో ఇండో జర్మన్ అసిసోసియేషన్ ఆధ్వర్యంలో జర్మనీలో నిర్వహించిన అంతర్జాతీయ కళా ప్రదర్శనల్లోనూ పాల్గొని అక్కడి వారితో ప్రశంసలందుకుంది.
- కూడిపూడి, భరతనాట్యంలో ప్రత్యేక కోర్సులు చేస్తూనే వివిధ వేదికలపై నృత్య భారతి, నాట్య మంజరి, కళా సౌరభ వంటి బిరుదులందుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

అనంత ఐకాన్‌గా మారుతా...



చిన్నప్పటి నుంచి అమ్మ, నాన్న ప్రోత్సాహిస్తూ వచ్చారు. అమ్మ గాయత్రికి శాస్త్రీయ నృత్యంలో ప్రవేశముంది. నటరాజ రామకృష్ణ వద్ద కొన్నేళ్లు నాట్యం నేర్చుకుని ఆపేసింది. తన ఆశయాన్ని నా ద్వారా ఆమె సఫలీకృతం చేసుకోవడం నాకెంతో ఆనందాన్నిస్తోంది. ఎప్పటికైనా నా శాస్త్రీయ నాట్యానికి అనంత ఐకాన్‌గా నిలవాలని ఉంది. భారతదేశం గర్వించదగ్గ నృత్యాలను మరిన్ని విదేశాలలో ప్రదర్శించాలన్నదే నా లక్ష్యం. – శ్రీదరి, అనంతపురం

నూతన చట్టాలపై పోలీస్ అధికారులకు శిక్షణ



శిక్షణకు హాజరైన సబ్ డివిజనల్ అధికారులు

హిందూపురం అర్బన్: నూతన చట్టాలను ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులు తెలుసుకున్నప్పుడే పూర్తిస్థాయిలో నేరాలపై పరిశోధన చేయగలరు. జూలై 1 నుంచి దేశ వ్యాప్తంగా కొన్ని నూతన చట్టాలు వస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండ సబ్ డివిజన్ కేంద్రాల్లో జిల్లా ఐటీ కోర్ టీం అధికారి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో వచ్చిన అప్డేట్స్, ఆసాక్షా యాప్, ఎన్‌సీఆర్‌బీ సంకలన్ యాప్, డీజీ లాకర్ యాప్ ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలి? వాటిని నేర పరిశోధనలో ఎలా ఉపయోగించుకోవాలి అనే అంశాలపై డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందికి డిజిటల్ బోర్డు ద్వారా అవగాహన కల్పించారు.